క్లుప్తంగా

ఘనంగా సీతారామాలయ ప్రారంభోత్సవం



సీతారామాలయంలో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బాడంగి: మండలంలోని పినపెంకిలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామపెద్దల సమక్షంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

బొబ్బిలి రూరల్: మండలంలోని కింతలివానిపేట ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తాం..

బొబ్బిలి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలలో త్రికరణ శుద్ధితో ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని గ్రాడ్యుయేట్ ఓటర్లు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని అలజంగిలో శనివారం వారు మాట్లాడుతూ.. నోటుకు ఓటు అమ్ముకోమన్నారు.

ఘనంగా మరియమాత పాప పరిహార పాదయాత్ర



బైబిల్ సారాంశాన్ని వివరిస్తున్న ఫాదర్

బాడంగి: మండలంలోని కోడూరులో వెలిసిన మరియమాత పాపపరిహార పాదయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మరియమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు బైబిల్ సారాంశాన్ని వివరించారు. వేలాది మంది భక్తులు రావడంతో కోడూరు ప్రాంతం జనసంద్రమైంది.

వేతనదారులు జాగ్రత్తలు పాటించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న సర్పంచ్ వసుంధర

బొబ్బిలి రూరల్: ఉపాధి వేతనదారులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర సూచించారు. మండలంలోని ముత్తాయవలస, కమ్మవలసలలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశాల వద్ద టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

రేగిడి: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో శనివారం ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఏపీ దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో క్యాలెండర్, గోడపత్రికలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇటువంటి సంఘాలు ఏర్పడడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు యాగాటి గణపతిరావు, ప్రధానకార్యదర్శి వన్నలి శ్యామసుందరరావు, గౌరవాధ్యక్షులు ఎన్.జయరాజుబాబు, రాష్ట్ర సభ్యులు వడ్డే పాపారావు, కోశాధికారి నిద్దాన రాము తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

బాడంగి: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారులు వి. గోవింద్, రాధిక తెలిపారు. శనివారం స్థానిక పశువుల ఆస్పత్రిలో సుమారు 450 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో సుమారు 14 వేల పశువులకు టీకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పశువుల కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి నడవలేక నీరసించిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో వీరితో పాటు వీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం



రాజాం: పట్టభద్ర ఓటర్లకు నమూనా బ్యాలెట్లు ఇస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం శనివారం సాయంత్రంతో ముసిగింది. చివరిరోజున ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో జోరుగా ప్రచారం చేపట్టారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. రాజాం పట్టణంలో ఎమ్మెల్యే జోగులు పట్టభద్ర ఓటర్లను కలిసి సుధకార్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

– సాక్షి రాజాం, బొబ్బిలి



వంగర: సుధాకర్‌ను గెలిపించాలంటూ వంగరలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ నాయకులు



రాజాం: సారధిలో ప్రచారం చేస్తున్న పాలవలస శ్రీనివాసరావు, తదితరులు



రామభద్రపురం: మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



తెర్లాం: ఆమిటిలో పట్టభద్రులను కలిసి సుధాకర్‌కు ఓటువేయాలని కోరుతున్న నాయకులు



రాజాం సిటీ: గార్రాజుచీపురుపల్లిలో ఓటరుకు బ్యాలెట్ నమూనా పత్రం అందిస్తున్న నాయకులు



రేగిడి: కందిశలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు తదితరులు



తెర్లాం: కూనాయవలసలో ప్రచారం చేస్తున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు

బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం: బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని బూసాయవలస కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం. దీప, మహిళా పోలీస్ ఆర్. లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ సంబరాలు మిన్నంటాలి..

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రంలో సంబరాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పట్టణ, మండల వార్డు స్థాయి నాయకులతో మండల కేంద్రంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9.30 గంటలకు బొబ్బిలి పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే మండల కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సీతంరాజు గెలుపునకు పనిచేయాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు రేజేటి ఈశ్వరరావు (విసు), తమ్మిరెడ్డి దామోదరరావులతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులతో సమావేశమయ్యారు. సీతంరాజు గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు శ్రీనివాసరావు, పార్వతి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే శంబంగి

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

• స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర

సంతకవిటి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శనదొర అన్నారు. సంతకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ ఎ.సులోచనారాణి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి వద్ద వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంతకవిటి మండలంలోని పట్టభద్ర ఓటర్లందరూ ఇక్కడే తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు తమ వెంట ఎన్నికల సంఘం గుర్తించి 12 రకాల ఐడీ కార్డులలో ఏదో ఒకదాన్ని తీసుకుని ఓటు వేసేందుకు రావాలని కోరారు. పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఎటువంటి వివాదాలకు తెరలేపినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.



అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

రాజాం సిటీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూట్-1 కింద వంగర, రేగిడి మండలాలు రూరల్ సీఐ పరిధిలోను, రూట్-2 రాజాం, సంతకవిటి మండలాలు టౌన్ సర్కిల్ పరిధిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల వరకు 144 సెక్షన్ ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత ఎన్నికకు అంతా సహకరించాలని కోరారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటు వేసేందుకు వెళ్లే వారు మొబైల్ తీసుకుని వెళ్లకూడదని సూచించారు. ఎన్నిక అనంతరం బాలెట్ బాక్స్‌లను విజయనగరం రిసెప్షన్ సెంటర్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎస్సై వై.రవికిరణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

పోలింగ్ కేంద్రాల జాబితా పబ్లికేషన్

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సంస్థల్లో ఖాళీలు ఏర్పడిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఎన్నికల నిర్వహణకు పోలింగ్ స్టేషన్లు తుది జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో అధికారులు ప్రదర్శించారు. సర్పంచ్ స్థానాలకు ఓనెఅగ్రహారం, లక్ష్మీపేట పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వార్డుమెంబర్లు కొప్పరవలస, రుషింగి, కొట్టిశ, ఇరువాడ గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సి ఉందని ఈఓపీఆర్డీ లోపింటి త్రినాధులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాజాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజాం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను జోనల్ ప్రత్యేకాధికారి వేణుగోపాలరావు శనివారం పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లపై తహసీల్దార్ విజయభాస్కర్ వద్ద వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజాం పట్టణం, మండలంలో మొత్తం 3020 మంది ఓటర్లు ఉన్నారని, వారంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 39, 40, 41, 41(ఎ) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, ఒక కమాండ్ కంట్రోల్ రూమ్ జిల్లా హెడ్‌క్వార్టర్ నుంచి కంట్రోల్ చేస్తుందని అన్నారు. ఓటరు పట్టభద్రుల ఓటుకు సంబంధించి గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు ద్వారా అందిన స్లిప్‌లతో పాటు గుర్తింపు కార్డు తీసుకొచ్చి ఓటు వేయాలని వివరించారు. పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ సీఐ రవికుమార్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూధర్మం గొప్పది

రాజాం సిటీ: హిందూధర్మం చాలా గొప్పదని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు రాజన్న అన్నారు. రాజాం బ్రాంచి ఆధ్వర్యంలో మండలంలోని నందబలగ గ్రామంలో శనివారం ధర్మప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 50 మంది వరకు ఫౌండేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలని, హిందూధర్మం గొప్పతనాన్ని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, గ్రామ కమిటీ సభ్యులు జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూములకు పట్టాలు

రేగిడి: మండలంలోని కొర్లవలసలో గత కొన్నేళ్లుగా రైతుల సాగు ఆదీనంలో ఉన్న ఇనాం భూములను సర్వే చేయించి, వాటిపై హక్కు పత్రాలను రైతులకు అందించనున్నట్లు తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి తెలిపారు. కొర్లవలసలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 826.74 ఎకరాలకు సంబంధించి 611 మంది రైతులకు 2010 సర్వే ప్రకారం భూమిని సర్వే చేస్తున్నామన్నారు. సర్వే కార్యక్రమం పూర్తయ్యాక చట్ట ప్రకారం రైతుల పేరిట నోటీసులు జారీ చేసి వాటిపైన ఎటువంటి అభ్యంతరాలు లేనిచో ఉన్నతాధికారుల దృష్టికి జాబితాను పంపించడం జరుగుతుందన్నారు. వారు అనుమతి ఇచ్చిన తరువాత పట్టాలు మంజూరు చేస్తామన్నారు.

ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

• ఆర్డీఓ శేషశైలజ

బొబ్బిలి రూరల్: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ పి.శేషశైలజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ మెటీరియల్‌ను పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల ఏర్పాట్లు, రూట్లు, జోన్లపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బొబ్బిలి డివిజన్ పరిధిలో 13 పోలింగ్ కేంద్రాలకు నాలుగు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బొబ్బిలి, రామభద్రపురం ఒక రూట్‌గాను, బాడంగి, తెర్లాం మరో రూట్‌గాను, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడలను ఇంకో రూట్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నిక పరిశీలనకు 13 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.



డిస్ట్రిబ్యూషన్ మెటీరియల్ పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న బాడంగి హెచ్‌ఎం త్రినాథరావు

బాడంగి: మరికొద్ది రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్. త్రినాథరావు అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే అవకాశం కల్పించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం గ్రాండ్‌టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో టీచర్లు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సూరినాయుడు కుటుంబానికి పరామర్శ

వంగర: మండల కేంద్రం వంగర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రౌతు సూరినాయుడు(మేస్త్రి) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సూరినాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాలవలస దవళేశ్వరరావు, ఏనుగుతల వెంకటనాయుడు, బొక్కేల వెంకటఅప్పలనాయుడు, బెవర అప్పలనాయుడు, కనగల పారినాయుడు, గొండేల తవిటయ్య మాస్టారు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

మర్యాదపూర్వక కలయిక

రాజాం: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులును అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు జిల్లాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ కొరగంజి ధర్మారావు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సాంస్కృతిక విభాగంలో తమకు స్థానం కల్పించినందుకు ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్న కోఆర్డినేటర్లు